క్లుప్తంగా

23న సర్వసభ్య సమావేశం

నింద్ర: మండల సర్వసభ్య సమావేశం ఈ నెల 23 బుధవారం ఉదయం 10 గంటలకు ఎంపీపీ అధ్యక్షతన మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహిస్తున్నట్లు మండల ఎంపీడీఓ శివప్రసాద్ వర్మ తెలిపారు. సమావేశానికి జెడ్పీటీసీ, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, వివిధ శాఖల మండల అధికారులు హాజరు కావాలని ఆయన కోరారు.

మహిళలు ఆర్థికంగా ఎదగాలి



మహిళలకు అవగాహన కల్పిస్తున్న చిట్టిబాబు, షాలిని

పాలసముద్రం: మహిళలు ఆర్థికంగా ఎదగాలని వాక్ ఫర్ ఫ్రీడం, రూరల్ యాక్షన్ ఫర్ సోషల్ సంస్థ ప్రతినిధి చిట్టిబాబు తెలిపారు. ఆదివారం ఆముదాల దళితవాడలో మహిళలకు డోర్ మాట్స్ తయారీపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. శిక్షణ కార్యక్రమానికి విచ్చేసిన చిట్టిబాబు మాట్లాడుతూ మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలనే ఉద్దేశంలోనే స్కిల్ ట్రైనింగ్ తీసుకొచ్చామని తెలిపారు. కార్యక్రమంలో సంస్థ ప్రోగ్రామ్ అనలిస్ట్ షాలిని, రాజకుమారి, బేబీ, శిరీష, సరల్, రేఖ, ఉమ, భువనేశ్వరి, కన్నయ్య, జయశంకర్, దేవన్, శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో గేదె మృతి



నగరి: మండలంలోని రామాపురం వద్ద రోడ్డు పక్కన నడచి వస్తున్న రెండు గేదెలను పుత్తూరు వైపు వేగంగా వెళుతున్న గుర్తు తెలియని వాహనం ఢీకొట్టి, వెళ్లిపోయింది. ఈ సంఘటనలో ఒక గేదె అక్కడికక్కడే మృతిచెందగా మరో గేదెకు తీవ్రగాయాలయ్యాయి. మృతి చెందిన గేదె విలువ రూ.40 వేలు ఉంటుందని, మరో గేదెకు భారీ ఖర్చుతో చికిత్స అందించాల్సి ఉందని పాడి రైతు ఆవేదనకు లోనయ్యాడు.

సీసీ రోడ్డు ప్రారంభం



సీసీ రోడ్డును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

శ్రీరంగరాజపురం: మండలంలోని పాపిరెడ్డిపల్లి గండ్లమిట్ట, 49 కొత్తపల్లిమిట్ట గ్రామంలో నూతనంగా వేసిన కొత్త సీసీ రోడ్లను ఎమ్మెల్యే డాక్టర్ థామస్ ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ నియోజకవర్గాన్ని పారిశ్రామిక హబ్‌గా తయారు చేస్తామన్నారు. తహసీల్దార్ లోకనాథపిళ్లై, ఎంపీడీఓ మోహన్‌మురళి, సర్పంచ్ ఢిల్లయ్య, జయంశంకర్ నాయుడు, గురునాథం, జీవన్‌కుమార్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

టీచర్ గాయత్రీదేవికి డాక్టరేట్



చిత్తూరు కలెక్టరేట్ : గుడిపాల మండలం చిత్తపార జెడ్పీ హైస్కూల్‌లో ఇంగ్లిష్ టీచర్‌గా పనిచేస్తున్న కరణం గాయత్రీదేవికి తిరుపతిలోని శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం డాక్టరేట్ ప్రకటించింది. ఆమె ఆ వర్సిటీ ఇంగ్లిష్ ప్రొఫెసర్ డాక్టర్ పి.హరిపద్మ రాణి పర్యవేక్షణలో 'రీడింగ్ గ్రేడెడ్ మెటీరియల్స్ ఇన్ ఇంగ్లిష్: ఏ కేస్ స్టడీ ఆఫ్ ఛాలెంజస్ ఫేస్డ్ బై గవర్నమెంట్ స్కూల్ చిల్డ్రన్ ఎట్ ద సెకండరీ లెవెల్ ఇన్ ఆంధ్రప్రదేశ్' అనే అంశంపై చేసిన పరిశోధనకు డాక్టరేట్ లభించింది. ఆమె ఓవైపు ఉపాధ్యాయ వృత్తిని కొనసాగిస్తూనే, మరో వైపు తన పరిశోధనలను పూర్తి చేసి త్వరలో యూనివర్సిటీ స్నాతకోత్సవంలో డాక్టరేట్ అందుకోనున్నారు. ఆమెను హరిపద్మరాణితోపాటు డీఈఓ దేవరాజులు, డీవైఈఓ చంద్రశేఖర్, గుడిపాల ఎంఈఓ-1 హసన్‌బాషా, ఎంఈఓ 2 గణపతి, చిత్తపార జెడ్పీ హైస్కూల్ హెచ్‌ఎం ఎంఆర్ శరవణ, సహచర ఉపాధ్యాయులు అభినందించారు.

ప్రారంభానికి నోచుకోని ఆర్బీకే భవనాలు

తవణంపల్లె : గత ప్రభుత్వం ప్రజల వద్దకు పరిపాలన అందించాలనే సంకల్పంతో సచివాలయాలు ఏర్పాటు చేసింది. మండలంలోని 17 పంచాయతీల్లో సచివాలయ భవనాలు, ఆర్బీకేలు, వెల్‌నెస్ సెంటర్ల భవనాలు నిర్మించింది. కొన్ని సచివాలయాలల్లో స్థానికంగా నెలకొన్న సమస్యల కారణంగా పనులు చేపట్టలేదు. పల్లెచెరువులో కోర్టులో కేసు ఉండడంతో పనులు ఆగిపోయాయి. టి.పుత్తూరులో రైతు భరోసా కేంద్రం, వెల్‌నెస్ సెంటర్ భవనాలు నిర్మాణం పూర్తయినా ఇప్పటి వరకు ప్రారంభించలేదు. వెంగంపల్లెలో సచివాలయ భవనం ప్రారంభం కాలేదు. పట్నం, పుణ్యసముద్రం, తవణంపల్లె గ్రామాల్లో సైతం పూర్తయిన భవనాలు ప్రారంభానికి నోచుకోలేదు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత బిల్లులు చెల్లించడం లేదని, అందువల్లే భవనాలను వినియోగంలోకి తీసుకురావడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు.

విద్యుత్.. ప్రీపెయిడ్



సాంకేతికత అన్ని రంగాల్లో విస్తరిస్తోంది. తాజాగా విద్యుత్ శాఖలో మరో అడుగు ముందుకు పడుతుంది. దీంతో విద్యుత్ బకాయిలకు చెల్లుచీటీ పడనుంది. వినియోగించే విద్యుత్ అవసరాలకు ముందుగానే రొక్కం చెల్లించేలా నూతన విధానం అమల్లోకి రానుంది. ప్రస్తుతం విద్యుత్ వాడకం అనంతరం ఎన్ని యూనిట్లు ఖర్చు చేశామో లెక్కకట్టి విద్యుత్ బిల్లు చెల్లిస్తున్నాం. త్వరలో స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేయనుండడంతో ముందస్తుగా రీచార్జ్ చేసుకుని వినియోగించుకోవాల్సి ఉంటుంది. అంటే మన సెల్‌ఫోన్‌కు ప్రీపెయిడ్ పద్ధతిలో ఏ విధంగా రీచార్జ్ చేసుకుని వాడుతున్నామో అదే విధానం అమలు కానుంది. విద్యుత్ మీటర్‌కు చేయించే రీచార్జ్ నగదు మేరకు సరఫరా కొనసాగనుంది. బ్యాలెన్స్ అయిపోయిన వెంటనే మళ్లీ రీచార్జి చేసుకోవాల్సి ఉంటుంది. లేకుంటే చీకట్లో మగ్గాల్సిందే. – పాలసముద్రం

- కసరత్తు ప్రారంభించి విద్యుత్ శాఖ
- తొలుత ప్రభుత్వ కార్యాలయాల్లో.. అని రకాల విద్యుత్ కనెక్షన్లకు మీటర్ల అమరిక
- ప్రీపెయిడ్‌తో గ్రామీణ ప్రాంత వినియోగదాలు అవస్థలు

ప్రస్తుతం ప్రభుత్వ కార్యాలయాల్లో స్మార్ట్ మీటర్లు ఏర్పాటులో సంబంధిత శాఖ యంత్రాంగం నిమగ్నమైంది. ఈ నెల వినియోగించిన కరెంటు బిల్లు మరుసటి నెల చెల్లిస్తున్నాం. బిల్లు పొందిన 15 రోజుల వరకు అపరాధ రుసుం ఉండదు. అపరాధ రుసుంతో మరో 15 రోజుల్లో బిల్లు చెల్లించడానికి సమయం ఉంటుంది. ఈ లెక్కన వినియోగదారుడికి బిల్లు చెల్లించడానికి దాదాపు నెల వరకు సమయం ఉండే ఈ పద్ధతినే అనుసరిస్తున్నాం. తాజాగా కేంద్ర ప్రభుత్వం మార్గదర్శకాలకు అనుగుణంగా స్మార్ట్ మీటర్ల ఏర్పాటుకు సంబంధించిన చర్యలను రాష్ట్ర ప్రభుత్వం ముమ్మరం చేసింది. త్వరలోనే అన్ని రకాల విద్యుత్ సర్వీసులకు స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేసేలా నిర్ణయించింది. ముందుగా అన్ని ప్రభుత్వ కమర్షియల్ కార్యాలయాల్లో స్మార్ట్ మీటర్ల అమరిక ప్రారంభమైంది. 2025 జనవరికి అన్ని రకాల విద్యుత్ సర్వీసులకు స్మార్ట్ మీటర్లు అమర్చాలనే నిర్ణయంతో అధికార యంత్రాంగం అడుగులు వేస్తుంది. ఈ నూతన విధానం ద్వారా ప్రీపెయిడ్ మీటర్లకు ముందుగానే రీచార్జి చేయాల్సి ఉంటుంది. అలా చేయకపోతే సరఫరా కట్ అయిపోతుంది. ఇప్పటి వరకు అమలవుతున్న విధానానికి అలవాటుపడిన వినియోగదారులకు దీనిపై మరింత అవగాహన కల్పించాల్సిన అవసరం ఉంది. నియోజకవర్గంలో దాదాపు 80 వేల పైచిలుకు వివిధ రకాల విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి పాలసముద్రంలో 4800 మీటర్లు వినియోగంలో ఉన్నట్లు అధికారుల సమచారం. 120 స్మార్ట్ మీటర్లను ప్రభుత్వ కార్యాలయాల్లో బిగిస్తున్నారు. ప్రస్తుతానికి ఆ మీటర్లలో ఎటువంటి సిమ్ కార్డు అమర్చలేదు. దశల వారీగా వాటిని ప్రీపెయిడ్ మీటర్లుగా మార్చనున్నారు.

బడుగులపై భారం

ఈ నూతన విధానం బడుగులకు భారం కానుంది. విద్యుత్ వినియోగదారుల్లో మధ్య తరగతి వారి కంటే బడుగులే అధికంగా ఉంటారు. వారు వినియోగించే విద్యుత్ సంబంధించి ముందుగా మొత్తం చెల్లించాలంటే వారికి భారమే. ప్రస్తుత రోజుల్లో క్షణం విద్యుత్ లేకున్నా ఉండడం కష్టం. ఈ తరుణంలో ప్రీ పెయిడ్ మీటర్ల వినియోగంతో ఇబ్బందులు తప్పేలా లేవు.

- నూతన ప్రీ పెయిడ్ మీటర్లతో అనవసరపు విద్యుత్ వినియోగం తగ్గుతుంది. వినియోగదారుల్లో బాధ్యత పెరుగుతుంది.
- ఈ నూతన విధానంతో గ్రామీణ ప్రాంత వినియోగదారులు అవస్థలు పడే అవకాశాలున్నాయి.
- మొండి బకాయిల బెడద తప్పుతుంది. ముఖ్యంగా ప్రభుత్వ కార్యాలయాలు ఇకపై అధిక బకాయిలు పెండింగ్‌లో ఉంచే అవకాశం ఉండదు.
- స్మార్ట్ ప్రీపెయిడ్ మీటర్లు అందుబాటులోకి వస్తుండడంతో దీని ప్రభావం విద్యుత్ మీటర్ రీడర్లపై పడనుంది. స్మార్ట్ మీటర్ రాకతో వీరంతా ఉపాధి కోల్పోయే అవకాశం ఉంది.
- విద్యుత్ చౌర్యం పెరిగే అవకాశం ఉంది. లైన్ల నుంచి విద్యుత్‌ను అక్రమంగా వాడుకునే వారి సంఖ్య పెరిగే అవకాశం ఉందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

స్మార్ట్ మీటర్లు

బ్యాలెన్స్ ఉన్నంత వరకే విద్యుత్ సరఫరా అవుతుంది. నగదు అయిపోయిన వెంటనే విద్యుత్ సరఫరా నిలిచిపోతుంది. రీచార్జి చేస్తేనే విద్యుత్ సరఫరా అవుతుంది. బ్యాలెన్స్ ఎంతుందో ఎప్పటికప్పుడు చెక్ చేసుకోవాలి.



ప్రస్తుతం మండలంలో అమర్చి ఉన్న (ఐఆర్‌డీఏ) శ్లాబ్ మీటర్లు



ప్రభుత్వ కార్యాలయంలో నూతన స్మార్ట్ మీటర్

రాత్రి సమయంలో రీచార్జి అయిపోతే ఎలా?



ప్రభుత్వం స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేయాలంటోంది. గ్రామీణ ప్రాంతాల్లో ఒకవేళ రాత్రి సమయంలో రీచార్జ్ అయిపోతే కరెంట్ కట్ అయిపోతుంది. నాకు రీచార్జ్ చేయడం కూడా తెలియదు. రాత్రంతా చీకటిలో ఉండాల్సిందేనా. ప్రభుత్వం స్పందించి మాలాంటి వారికి ఉన్న మీటర్లనే ఉంచాలి.

– శివ, ఏటుకూరిపల్లె

గ్రామీణ ప్రాంతాల్లో ఇబ్బందులు



గ్రామీణ ప్రాంతాల్లో ఈ స్మార్ట్ మీటర్ల వల్ల ఇబ్బందులు తప్పవు. పట్టణంలో ఉన్న వారికి ఇది మంచిదే. గ్రామీణ ప్రాంతాల్లో రీచార్జ్ అయిపోతే ఇల్లు అంధకారంలో ఉండాల్సిందే. రీచార్జి చేయాలంటే సెల్‌ఫోన్ దుకాణానికి వెళ్లాలి. అదే పట్టణంలో అలాంటి పరిస్థితి ఉండదు.

– కె.రాజేంద్రన్, శ్రీకావేరిరాజుపురం గ్రామస్తుడు

ప్రస్తుతానికి ప్రభుత్వ కార్యాలయాల్లో..



ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు అన్ని ప్రభుత్వం కార్యాలయాల్లో స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేస్తున్నాం. పాలసముద్రం మండల పరిధిలో 120 మీటర్ల ఏర్పాటుకు తొలివిడత కసరత్తు చేపట్టాం. ప్రస్తుతం 75 మీటర్లు ఏర్పాటు చేశాం. దశల వారీగా గృహ, వ్యాపార, పారిశ్రామిక సర్వీసులకూ అమలు చేయనున్నాం. వీటి ద్వారా రీడింగ్ యూనిట్లను ఎప్పటికప్పుడు తెలుసుకోవచ్చు. నాణ్యమైన సరఫరాను వినియోగదారులు పొందవచ్చు. ఉన్నతాధికారుల సూచనలతో పూర్తి స్థాయిలో అమర్చుతాం.

– వరదరాజు, ఏఈ, పాలసముద్రం

రాష్ట్రంలో మహిళలకు రక్షణ కరువు



కృపాలక్ష్మి

శ్రీరంగరాజపురం: కూటమి ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి రాష్ట్రంలో ప్రతి రోజు బాలికలు, మహిళలకు రక్షణ లేకుండా పోయిందని వైఎస్ఆర్ సీపీ రాష్ట్ర నాయకురాలు, గంగాధర నెల్లూరు నియోజకవర్గం ఇన్‌చార్జి కృపాలక్ష్మి అన్నారు. ఈ సందర్భంగా ఆమె మట్లాడుతూ పోలీసులు, కూటమి ప్రభుత్వం వైఫల్యమే బద్వేల్ ఘటనకు కారణమని ఆరోపించారు. నిత్యం రాష్ట్రంలో ఏదో ఒక చోట అత్యాచారాలు, అఘాయిత్యాలు, వేధింపులు సర్వసాధరణమైపోయాయ మండిపడ్డారు. గత వైఎస్ఆర్ సీపీ ప్రభుత్వం మహిళల రక్షణ కోసం ప్రవేశపెట్టిన దిశ చట్టం, దిశ యాప్‌ను నిర్వీర్యం చేశారన్నారు. రాష్ట్రం రానురాను అత్యాచారాంధ్రప్రదేశ్‌గా తయారువుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. గొప్పలు చెప్పుకునే సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ ఎక్కడ ఉన్నారని ప్రశ్నించారు. బద్వేల్ ఘటనకు కారణమైన నిందితుడిని ఎందుకు ఇంత వరకు అరెస్టు చేయలేదని ప్రశ్నించారు. ఈ కేసును నీరుగార్చితే వైఎస్ఆర్ సీపీ అధినేత, మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల ప్రకారం రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు చేపట్టి, ఉద్యమిస్తామన్నారు.

ఐరాలలో భారీ వర్షం

ఐరాల: మండలంలో శనివారం రాత్రి ఉరుములు, మెరుపులు, పిడుగులతో కూడిన కుండపోత వర్షం కురిసింది. దీంతో గార్గేయ నది ఉధృతంగా ప్రవహిస్తోంది. తహసీల్దార్ కార్యాలయం వద్దనున్న రోడ్డుపైన వరద నీరు ప్రవహించడంతో రాత్రి అధికారులు బారికేడ్లు ఏర్పాటు చేసి రాకపోకలను నిలిపివేశారు. ఆదివారం ఉదయం వరద ఉధృతి తగ్గిన తర్వా మార్గం గుండా రాకపోకలను పునరుద్ధరించారు. 35 యర్లంపల్లెలో భారీ వర్షానికి వరి పంట నేలకొరిగింది. వరి నీటిలో తడిస్తే రంగు మారుతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వర్షానికి దెబ్బతిన్న పంటలను వ్యవసాయాధికారులు పరిశీలించి నష్ట పరిహారం అందించాలని రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు.

మురుగు పారదు

విజయపురం: మండలంలో కోసలనగరం అభివృద్ధికి ఆమడ దూరంలో ఉంది. ఈ గ్రామంలో 200 కుటుంబాలు, 2వేల మంది జనాభా కలిగి ఉన్నారు. ప్రస్తుతం ఈ ప్రాంతం ఏపీఐఐసీకి ముఖద్వారంగా ఉంది. అయితే కనీసం వసతులు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మురికి కాలువలు, వీధి దీపాలు, తాగునీటి కొళాయిలు అంతంత మాత్రంగానే ఉన్నాయి.

పూడిక తీతకు నోచుకోని మురుగు కాలువ

కోసలనగరం గ్రామంలో మురికి కాలువ అధ్వానంగా ఉంది. కాలువల్లో పూడిక తీత పనులు చేపట్టకపోవడంతో మురుగు నీరు కదలడం లేదు. అంతే కాకుండా కాలువల్లో పిచ్చిమొక్కలు పెరిగి విషసర్పాలకు నిలయంగా మారాయి. రాత్రి పూట విష సర్పాలు ఎక్కువగా తిరుగుతున్నాయని స్థానిక ప్రజలు వాపోతున్నారు. వీధి దీపాలు అంతంత మాత్రంగానే ఉన్నాయి. దీంతో రాత్రి పూట ఆరు బయట అడుగు వేయడానికి భయపడుతున్నారు. అధికారులకు ఎన్ని సార్లు చెప్పినా పట్టించుకోవడం లేదు.





మరమ్మతులకు గురైన తాగునీటి కొళాయి, పిచ్చిమొక్కలతో పూడిపోయిన మురుగు కాలువ

మరమ్మతులకు గురైన కొళాయి

తాగునీరు అందించడానికి వీధుల్లో ఏర్పాటు చేసిన తాగునీటి కొళాయి మరమ్మతులకు గురైంది. దీంతో తాగునీరు వృథా పోతోంది. అంతే కాకుండా తాగునీరు వృథా పోవడంతో కొళాయి చుట్టూ బురదమయంగా మారింది. దీంతో పారిశుధ్యం లోపించింది. తాగునీరు పట్టుకోవడానికి కూడా ఇబ్బందిగా మారిందని స్థానికులు చెబుతున్నారు.

భీముడికి బలం పుష్కలం



ప్రసంగిస్తున్న రాధాక్రిష్ణారెడ్డి

చిత్తూరు రూరల్(కాణిపాకం): భీముడికి బలం పుష్కలమని, వజ్ర శరీరం కలిగిన వాడని ఉపన్యాసకులు దండాల రాధాక్రిష్ణారెడ్డి అన్నారు. చిత్తూరులోని ఓ హోటల్‌లో ఆదివారం రాత్రి చైతన్య సాహితి, హరివిల్లు లలిత కళావేదిక సంయుక్త నిర్వహణలో 'ఆంధ్ర మహాభారతంలో భీముడు' అనే అంశంపై ఉపన్యాస కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ భీముడు అత్యంత బలశాలిగా పేరొందాడన్నారు. భీమునికి 10 వేల ఏనుగు బలం ఉన్నట్లు మహాభారతంలో వర్ణించారన్నారు. ఉపాధ్యాయుడు అమర్‌నాథ్ రెడ్డి మాట్లాడుతూ, సమాజంలో ప్రతి ఒక్కరూ బలుడేనన్నారు. మంచి గుణం కలిగిన వాడు కూడా బలం కలిగిన వాడేనన్నారు. ఎవరికెవ్వరూ మనకు బలం లేదని తక్కువ అంచనా వేసుకోకూడదన్నారు. ఆలోచన అనే ఆయుధంతో బలంగా మారి కష్టాలను, నష్టాలను ఎదుర్కోవాలన్నారు. ప్రస్తుతం ఆత్మహత్యలు పెరిగాయని, ప్రతి ఒక్కరూ ఆలోచన అనే బలంతో సమస్యలపై ఎదుర్కొనేందుకు భీముడు బలంతో యుద్ధం చేయాలన్నారు. కార్యక్రమంలో సభ్యులు పల్లేరు హరినాయుడు, నాగిరెడ్డి, భాస్కర్‌రెడ్డి, జయరామరెడ్డి, మునస్వామి, చైతన్య సాహితి, రాజరత్నంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మూగజీవాలకు నట్టల నివారణ మందులు

గుడిపాల: నట్టల నివారణ మందుతో గొర్రెలు, మేకల్లో రక్తహీనతను నివారించడం సాధ్యమని పశువైద్యాధికారి సాయిసుధ అన్నారు. మండలంలోని 197రామాపురంలో మూగజీవాలకు నట్టల నివారణ మందును తాగించారు. ఆమె మాట్లాడుతూ, ఉచితంగా గొర్రెలు, మేకలకు నివారణ మందులను వేస్తామన్నారు. అంతర పరాన్నజీవులు కాలేయం, ఊపిరితిత్తులు, జీర్ణాశయం మొదలైన అవయవాల్లో తిష్టవేసి రక్తహీనతను గురిచేస్తాయని, వీటి బారిన నుంచి మూగజీవాల సంరక్షణకు నట్టల నివారణ మందులు విధిగా వాడాలని కోరారు. మండలంలో 10,385 గొర్రెలు, మేకలు ఉన్నాయన్నారు.

అత్యుత్తమం.. పంటల మార్పిడి

టీపీ కండ్రిగ వద్ద పంట సాగు



ప్రస్తుతం వర్షాలు కురుస్తుండడంతో గ్రామాల్లో వ్యవసాయ పనులు ఊపందుకున్నాయి. రైతులు పొలాలు దున్ని పంటలు సాగు చేసే పనిలో నిమగ్నమయ్యారు. నియోజకవర్గంలో 7704 మంది రైతులు 15723 ఎకరాల్లో పంటలను సాగు చేస్తున్నారు. అయితే ఏటా ఒకే రకమైన పంటలు సాగు చేయడంతో భూములు నిస్సారంగా మారి వ్యవసాయంలో ఆశించినంతగా ఫలితాలు రావడం లేదు. ఇటువంటి పరిస్థితుల్లో రైతులు పంట మార్పిడి పద్ధతులు అవలంబిస్తే మంచి దిగుబడులు పొందవచ్చు.

– నగరి

- భూసారం పెరిగి అధిక దిగుబడులు
- రసాయనిక ఎరువుల భారం తగ్గుదల
- తెగుళ్లు, చీడపీడల నుంచి రక్షణ

పంట మార్పిడితో దిగుబడి పెరగడమే కాకుండా భూమి కూడా సారవంతమవుతుంది. ఏటా ఒకే రకమైన పంటలు సాగు చేయడం ద్వారా పంట దిగుబడులు తగ్గడమే కాకుండా భూమి నిస్సారంగా మారి తెగుళ్లు, చీడపీడల సమస్యలు కూడా ఎక్కువగానే ఉంటాయి. ముఖ్యంగా పంట మార్పిడిలో భాగంగా నేలంతా కప్పేలా ఉండే పంటలను ఎంపిక చేసుకోవాలని వ్యవసాయశాఖ సిబ్బంది సూచిస్తున్నారు. ఇలా చేయడంతో పంటలో కలుపు మొక్కలు ఎక్కువగా రాకుండా ఉంటాయి. అలాగే నేల భౌతిక స్థితిలో కూడా మార్పు వస్తుంది. భూమిలో నీరు నిల్వ ఉండే శక్తి వృద్ధి చెంది చీడపీడలు దూరమవుతాయి. ఫలితంగా పంటల రక్షణకు ఉపయోగించే రసాయన ఎరువుల ఖర్చు కూడా తగ్గుతుంది.

తెగుళ్లు, చీడపీడల నివారణ

ప్రతి ఏటా ఒకే రకమైన పంటలు సాగు చేస్తే కొన్ని రకాల పురుగులు, తెగుళ్లు పంటలను ఆశించి వృద్ధి చెందుతాయి. దీని వలన పంట దిగుబడి కూడా చాలా వరకు తగ్గిపోతుంది. ఈ క్రమంలో ఏటా సాగు చేసే పంటను కాకుండా మార్పిడి చేసుకోవాలి. ఉదాహరణకు వరుసగా వరి పంట సాగు చేయకుండా పప్పు దినుసులు, నువ్వులు వంటి పంటలు సాగు చేసుకుంటే మేలు జరుగుతుంది. మినుములు, వేరుశనగ వంటి పంటలను లద్దె పురుగులు ఎక్కువగా ఆశించి నష్టపరుస్తాయి. వీటి ఉధృతిని అరికట్టేందుకు జొన్న, వరి, రాగులు వంటి ఆరుతడి పంటలతో మార్పు చేయాలి. వరి వేసే పొలానికి ముందుగా జనుములు వేస్తే సేంద్రియ ఎరువుగా తయారై పంటకు మంచి దిగుబడి ఉంటుంది. మొత్తంగా రైతులు పంట మార్పిడి వ్యవసాయం చేయడం లాభ దాయకంగా ఉంటుంది.

భూమికి మేలు చేసే పంటలు

పంటల మార్పిడిలో భాగంగా కందులు, మినుము, సజ్జ, పెసలు, ఉలవలు తదితర రకాల పంటలు సాగు చేయాలి. దీంతో వాటి వేర్లు భూమి నుంచి పోషకాలను సులభంగా తీసుకుంటుంది. కొంత మేర నీటి ఎద్దడిని కూడా తట్టుకుంటుంది. ఈ పంటల వేరు మొదళ్లు నత్రజనిని స్థిరీకరిస్తాయి. ఈ పంటలు సాగు చేయడంతో చాలా వరకు రాలిన ఆకుల రూపంలో సేంద్రియ ఎరువు లభిస్తుంది.



నారుమడి సిద్ధం చేస్తున్న రైతు

పంట మార్పిడితో అధిక దిగుబడి



పంటల మార్పిడితో దిగుబడి పెరుగుతుంది. వరి పంటకు ప్రత్యామ్నాయంగా ఉలవలు, రాగులు సాగు చేస్తే భూమి సారవంతంగా మారుతుంది. అలాగే భూమిలో జనుము వేసి బాగా దున్నితే సేంద్రియ ఎరువు తయారవుతుంది. దీని వలన రసాయన ఎరువుల ఖర్చు తగ్గుతుంది. ప్రస్తుతం మార్కెట్‌లో రాగులు, మినుములు, సజ్జ వంటి వంటలకు మంచి గిరాకీ ఉన్నందున ఈ పంటలు సాగు చేసుకోవచ్చు.

– రాఘవేంద్రయాదవ్, ఏఓ, నగరి మండలం

రోడ్డు బాగు చేయండి



గుంతలమయంగా చవరంబాకం రోడ్డు

నింద్ర: మండలంలోని చవరంబాకం గ్రామ రోడ్డు మరమ్మతులు చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు. ఈ రోడ్డు వర్షం పడితే చాలు పూర్తిగా గుంతలమయంగా మారుతోంది. దీంతో ద్విచక్ర వాహనదారులు పలుమార్లు ప్రమాదానికి గురయ్యారు. రాత్రిళ్లు ఈ రోడ్డుపై ప్రయాణం నరకప్రాయంగా మారింది. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్డు మరమ్మతులు చేయాలని కోరుతున్నారు.

వధూవరులకు ఆశీర్వాదం



చెంచుగుడిలో వధూవరులను ఆశీర్వదిస్తున్న మాజీ ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి

వెదురుకుప్పం: చెంచుగుడి గ్రామానికి చెందిన వైఎస్ఆర్ సీపీ నాయకుడు కృష్ణారెడ్డి కుమార్తె పెళ్లి వేడుకలకు ఆదివారం మాజీ ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి హాజరయ్యారు. ఈ సందర్భంగా నూతన వధూవరులను మాజీ మంత్రి ఆశీర్వదించారు. శనివారం రాత్రి తిరుపతిలో జరిగిన నక్కలాంపల్లె గ్రామానికి చెందిన వైఎస్ఆర్ సీపీ కార్యకర్త చెంగల్రాయులు కుమారుడు పెళ్లికి వెళ్లి వారిని ఆశీర్వదించారు. మాజీ డిప్యూటీ స్పీకర్ కుతూహలమ్మ కుమారుడు వైఎస్ఆర్ సీపీ నేత హరికృష్ణ కూడా పెళ్లి వేడుకలకు హాజరై నూతన దంపతులను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ సుకుమార్, వైఎస్ఆర్ సీపీ మండల అధ్యక్షుడు పద్మనాభరెడ్డి, ఉపాధ్యక్షుడు రామయ్య, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి బండి హేమసుందర్‌రెడ్డి, బీసీ సెల్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి బట్టే సుబ్రమణ్యం, సర్పంచ్ గోవిందయ్య, జిల్లా స్టీరింగ్ కమిటీ సభ్యుడు శివాజీ ఎంపీటీసీ మాజీ సభ్యులు గురవారెడ్డి, రోశిరెడ్డి, నాయకులు భీమశంకర్‌రెడ్డి, లోకేష్‌రెడ్డి, షణ్ముగంరెడ్డి, పట్టాభిరెడ్డి, రమేష్‌రెడ్డి, మాజీ ఎంపీపీ జ్ఞానమ్మ, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు గోవర్ధన్‌రెడ్డి, విజయశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

చినుకు పడితే అంధకారమే!



గుడిపాల: మండలంలోని పలు గ్రామాల్లో చినుకు పడితే చాలు బ్రేక్‌డౌన్ సమస్యతో విద్యుత్ సరఫరా లేక అంధకారంలో మగ్గిపోతున్నాయి. రాత్రివేళ తరచూ విద్యుత్ సరఫరాలో అంతరాయం వల్ల తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో పనిచేసే ట్రాన్స్‌కో సిబ్బంది పట్టణ ప్రాంతాల్లో నివాసముంటూ గ్రామాల్లో అందుబాటులో ఉండటం లేదు. దీనికి తోడు సిబ్బంది కొరత వల్ల సకాలంలో లైన్ల పునరుద్ధరణ పనులు చేపట్టకపోవడంతో తరచూ బ్రేక్‌డౌన్ సమస్య తలెత్తుతున్నట్టు తెలుస్తోంది. రాత్రివేళల్లో బ్రేక్‌డౌన్ సమస్య ఉత్పన్నమైతే విద్యుత్ సరఫరాను పునరుద్ధరించేందుకు 10–15గంటల సమయం పడుతుండడంతో అంధకారంలో మగ్గిపోవాల్సి వస్తోందని గ్రామీణులు మండిపడుతున్నారు. పలు ప్రాంతాల్లో విద్యుత్‌తీగలు మనుషులకు తగిలేంత ఎత్తులో వేలాడుతుండడం, కంపచెట్ల మధ్యలో విద్యుత్ తీగలు ఉండడం..మరిన్ని సాంకేతిక సమస్యల వల్లనే సమస్య తలెత్తుతోంది. ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు విద్యుత్‌లైన్ల పనులను పునరుద్ధరించి సమస్యను పరిష్కరించాలని గ్రామీణ ప్రజలు కోరుతున్నారు. ఈ విషయంపై ట్రాన్స్‌కో ఏఈ కరీముల్లా వివరణ కోరగా, బ్రేక్‌డౌన్ సమస్య తలెత్తకుండా అవసరమైన చర్యలు తీసుకుని సక్రమంగా విద్యుత్ సరఫరా చేయడానికి కృషి చేస్తామన్నారు.